క్లుప్తంగా

ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలోని ఎల్–ఎంఎల్ విభాగం విద్యార్థులు సీవీసీఓఆర్‌పీ ప్రెజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల కర్నూలు జిల్లాలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీవీసీఓఆర్‌పీ ప్రెజెంటేషన్ హ్యాకథాన్ నిర్వహించారన్నారు. కళాశాలకు చెందిన నరేంద్ర (సీఎస్ఈ) ధనలక్ష్మి (సీఎస్ఈ) శ్రీనిత్య (సీఎస్‌డీ) రామకృష్ణ (సీఎస్ఎం) ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.10 వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ డాక్టర్ చిత్రలింగప్ప, డాక్టర్ వీర ప్రకాష్, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ కొండన్న, విజయ భాస్కర్ అభినందించారు.

దాడి కేసులో ఆరుగురి అరెస్ట్



దాడి చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో ఇటీవల నరసింహ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ కేసులో పెద్ద ఓబులేసు, చిన్న ఓబిలేసు, ఓబయ్య, ఓబుళపతి, మధు, ఠాగూర్ అనే ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బుధవారం హత్యాయత్నానికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చడం జరిగిందని వెల్లడించారు. మండలంలో ఎవరైనా దాడులకు ఎగబడినా, పాత కక్షలను మనస్సులో పెట్టుకుని గొడవలు సృష్టించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో మంగళవారం అర్ధరాత్రి పంట పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

'పశుగణనపై నిర్లక్ష్యం వహించొద్దు'



పుట్లూరులో పశుగణనను పరిశీలిస్తున్న డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి

పుట్లూరు: పశుగణనపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ అనంతపురం డివిజనల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలో జరుగుతున్న పశుగణనను పర్యవేక్షించారు. ప్రతి ఇంటిని సందర్శించి సర్వే చేపట్టడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన స్టిక్కర్‌ను ఇళ్లకు అతికించాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ సర్వే ద్వారా పశువుల సంఖ్య, గొర్రెలు, మేకలు, కోళ్ల సంఖ్యపై స్పష్టత వస్తుందన్నారు. నవంబర్ 1వ తేదీన ప్రారంభమైన పశుగణన 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఖదీర్ భాషా, డాక్టర్ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి కోటను అభివృద్ధి చేయాలి

గుత్తి: ఎంతో చరిత్రాత్మమైన గుత్తి కోటను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం గుత్తి కోటలో ఆయన సమితి సభ్యులతో కలిసి మాట్లాడారు. గుత్తి కోటపైకి వెళ్లేందుకు సరైన దారి లేదన్నారు. తాగునీటి సదుపాయం కూడా లేదని తెలిపారు. దారిని ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. గుత్తి కోటలో ఏనుగు శాలలు, గుర్రపు శాలలు, రంగ మంటపం, 101 బావులు, దేవాలయాలు, చీకటి గదులు వంటివి ఎన్నో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోటను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోట అభివృద్ధి చెందితే పర్యాటకులు సంఖ్య పెరిగి ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సలహాదారుడు గురుశంకర్, ఉపాధ్యక్షుడు కాశీరావు, యువజన కార్యదర్శి కోటేశ్వరరావు, సభ్యులు ఓబులేసు, నాగేంద్ర, హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య

గుత్తి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణ తరగతులు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్లపై దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. 2025–26 సంవత్సరంలో గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు ప్రతి అధికారి గ్రామాల్లో పర్యటించాలని తెలిపారు. ప్రజల సహకారంతో ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శులు వెంకటేష్, ధనలక్ష్మి, సాదిక్ వలి, ఏపీఓ మద్దిలేటి, ఏఓ ముస్తాక్ అహ్మద్, శిక్షకుడు శ్రీధర్‌గౌడ్, ఏపీఎం అరుణకుమారి, కార్యాలయ సిబ్బంది అబ్దుల్, వాసు పాల్గొన్నారు.

ప్రణాళికలను తయారు చేయాలి

శింగనమల: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలను తయారు చేయాలని జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు ప్రణాళికల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేసేటప్పుడు విద్య, వైద్యం, యువత విద్యార్థులు, రైతులు, కూలీలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విడుదలైన నిధులను వాడుకోకపోతే భవిష్యత్‌లో ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆస్కారం ఉండదన్నారు. గ్రామ పంచాయతీలో ముఖ్యమైన పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మల కుమారి, వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్ నాగమునెమ్మ, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాప్రతినిధుల శిక్షణ

యల్లనూరు: పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు పంచాయతీల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు మాట్లాడుతూ.. పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచుకుని అభివృద్ధికి పాటుపడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు, గ్రామ పంచాయతీ నిధులు, 2025–26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● శింగనమల చెరువులో తెప్పోత్సవం



శింగనమల: స్థానిక రంగరాయల చెరువులో బుధవారం సాయంత్రం ఆత్మాసీతారాములు, గొల్లకొండ వేంకటరమణస్వామి, వాసవీమాత తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఉత్సవ మూర్తులను గ్రామంలోని ఆలయాల నుంచి ఊరేగింపుగా చెరువు వద్దకు చేర్చారు. దుర్గాంజనేయ గుడి సమీపంలో చెరువులో సిద్ధంగా ఉంచిన తెప్పపైన ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి పూజలు చేసిన అనంతరం నీటి మధ్యలో తీసుకెళ్లారు. చెరువు మధ్యలో గంగ పూజ అనంతరం ఒడ్డుకు చేర్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

బుక్కరాయసముద్రం/అనంతపురం: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ అనంతపురం మొబైల్ కోర్టు న్యాయమూర్తి సుజిన్‌కుమార్ తీర్పు వెలువరించారు. సీఐ కరుణాకర్ తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం బాటలో కొత్తపల్లి గ్రామంలోని రెండు ఇళ్లల్లో గత ఏడాది ఆగస్టు 9న చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నార్పల మండలం చింతవనం కొట్టాలకు చెందిన బుస్సే సుభాష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి ఈ కేసులో వాదనలు కొనసాగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సుజిన్‌కుమార్ తీర్పు వెలువరించారు.

ఐదు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డులోని సిద్దార్థ టవర్స్ సమీపంలో ఉన్న ఐదు దుకాణాల్లో మంగళవారం రాత్రి దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. ఓ ఫర్టిలైజర్ గోదాము, రెండు బార్బర్‌షాపులు, మీసేవా కేంద్రం, రుద్ర ఏజెన్సీకి చెందిన శానిటరీ, ఎలక్ట్రికల్ షాపుల్లో చోరీ జరిగింది. దొంగ తాళాలు, రేకులతో నిర్మించిన షెడ్లకు కన్నం వేసి చోరీకి పాల్పడ్డారు. అయితే రుద్ర ఏజెన్సీలో మాత్రమే రూ.20 వేల నగదును అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. ఏజెన్సీ నిర్వాహకుడు రామమోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌పీ నియామకంపై మహిళల ఆగ్రహం



కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా సభ్యులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని వనిత మహిళా సమాఖ్య (బీసీ కాలనీ) ఆర్‌పీ నియామకంపై వివాదం రాజుకుంది. మున్సిపల్, మెప్మా అధికారులు అనాధికారికంగా సంఘంలో సభ్యురాలు కాని మహిళను ఆర్‌పీగా నియమించి సర్వే చేయిస్తున్నారని ఆరోపిస్తూ వనితా మహిళా సమాఖ్య సభ్యులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు.. వనిత మహిళా సమాఖ్యకు ఉమామహేశ్వరి ఆర్‌పీగా ఉండేది. అనివార్య కారణాలతో ఆమె యేడాది క్రితం రాజీనామా చేసింది. గత ఆరు నెలల క్రితం పద్మావతి అనే మహిళను ఆర్‌పీగా నియమించారు. అయితే ఆమెను విధులు నిర్వహించకుండా మెప్మా అధికారులు (టీఎంసీ, సీసీలు) అడ్డుకున్నారు. మహిళా సంఘాల సభ్యుల వివరాలపై సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో రెండు రోజుల క్రితం మెప్మా సీసీ ఓ మహిళను వెంటబెట్టుకుని (అనాధికారికంగా నియమించిన ఆర్‌పీ) సర్వేకు వెళ్లింది. దీంతో మహిళా సంఘాల సభ్యులు అడ్డుకున్నారు. వనిత మహిళా సమాఖ్యలో సభ్యురాలైన పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని.. ఆమెను కాదని కొత్త వారిని ఎలా నియమిస్తారని సీసీని నిలదీశారు. బుధవారం మహిళా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మెప్మా, మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆర్‌పీ ఉండగా మరో ఆర్‌పీని తమకు తెలియకుండా ఎలా నియమిస్తారని నిలదీశారు. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అక్కడే ధర్నాకు దిగారు. మెప్మా, మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పద్మావతిని విధులోకి తీసుకుని కొత్తగా నియమించిన ఆర్‌పీని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై టీఎంసీ శ్రీనివాసరెడ్డి, సీసీలు చంద్రశేఖర్, సురేఖను సంప్రదించగా.. ఆర్‌పీ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. తాము కొత్తవారిని ఆర్‌పీగా నియమించలేదన్నారు. పద్మావతి ఆర్‌పీ అనే విషయం అవాస్తవమన్నారు. త్వరలోనే వనిత మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించి కొత్త ఆర్‌పీని నియమిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం:పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేవీకేలో రైతులకు పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. పత్తి పంట సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన కల్పించారు. గులాబీ పురుగు నివారణకు రైతులు పొలంలో అక్కడక్కడ లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కేవీకేలో సాగు చేసిన పత్తి పంట డెమో చూపించారు. కార్యక్రమంలో పత్తి పరిశోధనా సంస్థ నోడల్ అధికారి డాక్టర్ వలర్మతి, వ్యవసాయ అధికారి మల్లేశ్వరి, సాయికుమార్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోండి

పెద్దవడుగూరు: పత్తి పంట సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర పత్తి పంట పరిశోధన నోడల్ అధికారి డాక్టర్ వలర్మతి, కృషి విజ్ఞాన కేంద్ర సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నవడుగూరు, పెద్దవడుగూరు, దిమ్మగుడి, కొట్టాలపల్లి గ్రామాల్లో సాగు చేసిన పత్తిని పరిశీలించారు. ప్రస్తుత కాలంలో పత్తి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంది, పత్తి పంట సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పద్ధతిలో పంట సాగు చేయడం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ రజిని, సునీత పాల్గొన్నారు.

కబడ్డీకి పూర్వ వైభవం తీసుకురావాలి



కబడ్డీ క్రీడాకారుడు లక్ష్మయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: కబడ్డీకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో అనంతపురం, కర్నూలు జిల్లా కబడ్డీ క్రీడాకారుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వి.వీరలంకయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆర్.హరినాథగౌడ్, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు, ప్రస్తుత విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌చౌదరి, సీనియర్ కోచ్ సత్యనారాయణ, మాజీ క్రీడాకారులు గోపీనాథ్, మస్తాన్ తదితరులు హాజరై, మాట్లాడారు. వందలాది మంది కబడ్డీ క్రీడాకారులు ఒకే వేదికపై కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రెండు జిల్లాలోనూ అనేక టోర్నీలు నిర్వహించి కబడ్డీ క్రీడకు జీవం పోషిన ఆర్.హరినాథ్‌గౌడ్, వీరలంకయ్యను అభినందించారు. కబడ్డీలో రాణించిన పలువురికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు లక్ష్మన్న, తిరుపతి, అశ్వత్థ, రమాదేవి పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

గుంతకల్లు టౌన్: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్నుల బకాయిలను సత్వరమే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కమిషనర్ స్వయానా బకాయిదారులను కలిశారు. వివేకానంద ఎంబీఏ కాలేజీ యాజమాన్యం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1.62 లక్షల ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఎర్రిస్వామి, సికె.రామాంజనేయులు, వార్డు అడ్మిన్లు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుంతకల్లు రూరల్: ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని డీఎల్‌డీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బీవీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరును వివరించారు. అపార్ కోసం ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఈ ఏడాది రబీలో 395 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. డిసెంబర్ 15లోపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఎకరా పప్పుశనగకు రూ.450 చొప్పున ఇన్సూరెన్స్ చెల్లిస్తే పంట నష్టం ఏర్పడిన రైతుకు రూ.30 వేల దాకా పరిహారం లభిస్తుందన్నారు. హెక్టారు వరికి రూ.1,575 ఇన్సూరెన్స్ చెల్లిస్తే పరిహారం రూ.లక్ష వరకూ అందుతుందని పేర్కొన్నారు. హెక్టారు జొన్నకు రూ.788 ఇన్సూరెన్స్ చెల్లిస్తే రూ.52 వేల వరకూ, హెక్టారు మొక్కజొన్నకు రూ.1,313 ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తే రూ.87,500 వరకూ పరిహారం అందుతుందని తెలిపారు. సొంతిల్లు లేని వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హౌసింగ్ కార్యాలయంలో సంప్రదిస్తే వారికి వెంటనే ఇళ్లు మంజూరు ప్రక్రియను చేపడతామని హౌసింగ్ ఏఈ తెలిపారు. గుండాల తండాను ఎస్టీ గ్రామంగా జిల్లా కలెక్టర్ ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది 15 మంది రైతులు 39 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టారన్నారు. ఉపాధిహామీ పథకం కింద గడచిన 7 నెలలకు గానూ 7,398 కుటుంబాలకు కూలీల రూపంలో రూ.10.32 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.84 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అవనిక

తాడిపత్రి టౌన్: పట్టణంలోని శ్రీసాయి చైతన్య పాఠశాల విద్యార్థిని అవనిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ లక్ష్మీనరసింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల బాపట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి అండర్–14 విభాగం కబడ్డీ పోటీల్లో అవనిక ఉత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. దీంతో అవనికను రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవనికను అభినందించారు.

మంటలు చెలరేగి వీఆర్‌ఓ దంపతులకు గాయాలు

తాడిపత్రిటౌన్: ఇంట్లో గ్రీజర్ గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో వీఆర్‌ఓ దంపతులు గాయపడ్డారు. వివరాలు... తాడిపత్రిలోని శ్వేతద్వీపం కాలనీలో నివాసముంటున్న వీఆర్‌ఓ ప్రశాంత్ బుధవారం సాయంత్రం బాత్‌రూంలో ఉండగా ఒక్కసారిగా గ్రీజర్‌లో ఎల్‌పీజీ లీక్ అయి మంటలు చెలరేగాయి. దీంతో కేకలు వేయడంతో భార్య కరుణ ఆయనను మంటల నుంచి బయటకు లాగేసింది. ఆ సమయంలో ఆమె చేతులు కాలాయి. ప్రశాంత్‌కు ఛాతీపై కాలిన గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వారు చికిత్స పొందారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

గుత్తి: 14 సంవత్సరాల్లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి హెచ్చరించారు. మండల న్యాయ సేవా సమితి చైర్మన్, ఏడీజే శ్రీహరి ఆదేశాల మేరకు మండల లీగల్ సెల్, లేబర్ ఆఫీసర్, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల్లోపు పిల్లలను బేకరీలు, హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లలో పనులకు పెట్టుకోవద్దన్నారు. పిల్లలు బడుల్లో ఉండాలని తెలిపారు. పనుల్లో ఉండకూడదన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ ఉమాదేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్, హ్యాండ్స్, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి సీఎస్ఐ టౌన్ చర్చి నూరు వసంతాల వేడుకలు



మాట్లాడుతున్న సీఎస్ఐ టౌన్ చర్చి కమిటీ సభ్యులు

గుత్తి: సీఎస్ఐ టౌన్ చర్చి నూరు వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో కమిటీ చైర్మన్ రెవరెండ్ సాల్మన్, సెక్రెటరీ సురేంద్రబాబు, కోశాధికారిణి జేజే మనోరంజిత, డివిజనల్ సెక్రెటరీ విజయ కుమార్, ఎడ్యుకేషన్ బోర్డు సెక్రెటరీ రస్సెల్ కిరణ్ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు చర్చి నూరు వసంతాల వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. మొదటి రోజు ర్యాలీ, రెండవ రోజు ప్రముఖులకు సన్మానాలు, మూడవ రోజు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు దయానంద్, బింగి కిరణ్ బాబు, జేమ్స్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?



ఎంపీడీఓ సాల్మాన్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించరా అని జెడ్పీటీసీ భాస్కర్ మండిపడ్డారు. బుధవారం ఎంపీడీఓ సాల్మాన్‌ను ప్రొటోకాల్‌పై నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా ప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇటీవల కేకే అగ్రహారంలో జరిగిన జిల్లా స్థాయి పొరహక్కుల సమావేశంలో కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికార యంత్రాంగం హాజరైందన్నారు. అయితే జెడ్పీటీసీ అయిన తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారీ సమావేశాలకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వక పోవడం సరికాదని హితవు పలికారు. వడియంపేట గ్రామంలో జరుగుతున్న సమావేశానికి వైస్ ఎంపీపీ రామగోపాల్‌కు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఎంపీడీఓ సాల్మాన్‌కు ఫోన్‌లో జెడ్పీటీసీ భాస్కర్ సమక్షంలో ఫిర్యాదు చేశారు. దళిత ప్రజాప్రతినిధి జెడ్పీటీసీ అయిన తనకు ప్రొటోకాల్ విషయంలో అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెదుల్ల, పొడరాళ్ల సర్పంచులు శ్రీనివాసరెడ్డి, ఎర్రిస్వామి, పూల నారాయణ స్వామి, లక్ష్మీరెడ్డి, చెన్నంపల్లి ఎంపీటీసీ నాగయ్య, సాయి, నిమ్మల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఈకి సన్మానం

గుంతకల్లు: ఇటీవలే బదిలీ అయిన గుంతకల్లు డీఈఈ రంగస్వామిని పట్టణ విద్యుత్‌శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక మహేంద్ర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుత్తి ఈఈ వి.రాజశేఖర్, ప్రస్తుత గుంతకల్లు డీఈఈ నాగేంద్ర హాజరై రంగస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోవాలి

తాడిపత్రిటౌన్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిని నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని అన్ని వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వార్డులోకి గాలి వెలుతురు వచ్చేలా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బందితో సమావేశం నిర్వహించి పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం అసోసియేషన్ డైరెక్టర్ సతీష్, డాక్టర్ నీరద, డాక్టర్ సందీప్, హెడ్‌నర్స్ సావిత్రి పాల్గొన్నారు.